## అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకే ఇంటింటి సర్వే



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

కంఠేశ్వర్, నవంబర్ 9 : అర్హులైన ప్రతిఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు వర్తింపజేయాలనే ఉద్దేశంతో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలి పారు. సర్వేపై ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రణాళికా శాఖ చీఫ్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయాతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై సమీక్షించారు. సర్వేపై ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యుమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. సర్వే కోసం జారీ చేసిన బుక్‌లెట్ నుంచి కచ్చితమైన సమాచారం సేకరణతో వివరాలు నమోదు చేయాలనిచేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, సీపీవో మల్లికార్జున్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

## అది అనుమానాస్పద మృతి కాదు.. హత్య

వినాయక్‌నగర్, నవంబర్ 9: జిల్లా కేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలోని వైన్స్ వద్ద లక్ష్మణ్ (30) తీవ్ర గాయాలతో పడి ఉండి దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే సదరు యువకుడిది అనుమానాస్పద మృతి కాదని, హత్య అని పోలీసుల విచారణలో తేలింది. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలానికి చెందిన లక్ష్మణ్ లారీపై క్లీనర్‌గా పని చేస్తుండగా..కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో లారీ యజమాని క్లీనర్ విధుల నుంచి తొలగించగా.. నగరంలోనే ఉంటూ ఏదో ఒక పని చేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కాలూర్ బైపాస్ రోడ్డులో ఉన్న వైన్స్ షాపు వద్ద మద్యం తాగుతున్న లక్ష్మణ్‌కు మరో వ్యక్తితో గొడవ జరిగింది. దీంతో ప్రత్యర్థి లక్ష్మణ్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో పడి ఉన్న లక్ష్మణ్‌ను శుక్రవారం ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## డబ్బుల కోసం వేధించడంతోనే నా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు..

వినాయక్‌నగర్, నవంబర్ 9: డబ్బుల కోసం వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొంటూ ఆస్మను బేగం అనే మహిళ ఆరోటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్(38) ఈ నెల 5 నుంచి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి, మరుసటిరోజు నెహ్రూనగర్‌లో ఉన్న అశోక్‌సాగర్‌లో శవమై తేలాడు. హబీబ్ స్థానిక పూలాంగ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నుంచి బాకీ తీసుకున్నాడు. బాకీ చెల్లించడం ఆలస్యమవడంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తి .. తన బంధువు అయిన వన్‌టౌన్

**ఆరోటౌన్ పోలీసుస్టేషన్‌లో భార్య ఫిర్యాదు**

ఏఎస్సై షకీల్‌కు ఎలాగైనా డబ్బులు వసూలు చేసి ఇవ్వాలని చెప్పాడు. దీంతో సదరు ఏఎస్సై ఐదు రోజుల క్రితం హబీబ్‌ను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు రప్పించుకొని డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. ఠాణాలోనే బలవంతంగా పేపర్ రాయించుకున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన తన భర్త హబీబ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆస్మను బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్సైతోపాటు మరో వ్యక్తిపై ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేపట్టినట్లు ఎస్సై వెంకట్‌రావ్ తెలిపారు.

## సభ కోసం స్థల పరిశీలన

కంఠేశ్వర్, నవంబర్ 9 : సారంగాపూర్‌లో వచ్చే జనవరిలో నిర్వహించనున్న తబ్లికే జమాత్ ఇస్తే మా సభ కోసం స్థలాన్ని ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ శనివారం పరిశీలించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర నుంచి దాదాపు రెండు లక్షల మం ది హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## యువకుడి అదృశ్యం

సిరికొండ, నవంబర్ 9 : మండలంలోని రావుట్ల గ్రామానికి చెందిన అరవింద్ అదృశ్యమైనట్లు ఎస్సై రాము తెలిపారు. ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన అతడి కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. శనివారం సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.























